# 'భార్యోపహతుడు!'

రామం రైలు స్టేషనులోనే అదోలా అయిపొయ్యాడు రైలుపెట్టెలో కూర్చున్న సుందరి ఇల్లు జాగ్రత్త అంటూ తాను లేనప్పుడు అతను ఏయే వస్తువులను ఎలా చూచుకోవాలో, పని మనిషితో ఏమేమి పనులు చేయించుకోవాలో, ఏ పనులు చెప్పకూడదో, ఏయే సందర్భాలలో దానిని ఒక కంట కనిపెట్టి వుండాలో శ్రద్ధగా చెబుతూవుంది అంత సేపూ అతను ఎటో చూస్తూ ఏమిటో ఆలోచిస్తున్నాడేగాని సుందరి ఏం చెప్పిందో, తానేం విన్నాడో అతనికి సరిగా గుర్తులేదు గార్డు విజిల్ వేసి రైలు కూత పెట్టడంతో అతను సుందరి సమక్షంలో పడి ఆమె మొహంలోకి చిన్న పిల్లవాడిలా చూచాడు సుందరి సంగతి గ్రహించి అతని కళ్ళల్లోకి సాభిప్రాయంగా సానుభూతిగా చూస్తూ వొచ్చే నవ్వును ఆపుకుంటూ వ్యంగ్యంగా 'ధైర్యంగా వుండండేం' అంది ఆ మాట తన బలహీనతను తనకు చూపించినట్టూ, అది తాను చిన్నబుచ్చుకోవలసిన సందర్భమన్నట్టూ అనిపించినా సుందరికేసి అలాగే చూస్తూ వుండిపోయాడు రైలు మరోకూత వేయడంతో రామం అప్రయత్నంగా రైలుపెట్టె కిటికీ చువ్వ పట్టుకున్నాడు సుందరి 'మీరిక వుండండి' అని వారించకపోతే అతను అలాగే పట్టుకొని నడిచేవాడేమో' రైలు కదిలి చివరి పెట్టె కూడా దూరంగా వెళ్ళిపోయిన తరువాత ప్లాట్ ఫారంపై అంత మంది జనం వున్నా రామం నిర్జన ప్రదేశంలో ఏకాకిలా అనుభూతి పొందాడు'

ఆ మహానగరంలో, ఆ సంధ్య వేళ సందులేకుండా జనం వున్నా రామం ఏకైక పథికుడుగా ఇంటికి చేరుకున్నాడు తాళంతీసి బిక్కు బిక్కుగా ముందుగదిలో అడుగు పెట్టేసరికి కొత్త యింటికి వచ్చినట్లనిపించింది గది అంతా చీకటి మనస్సు అంతకంటె అంధకారబంధురం కాసేపు ఆలాగే వుండిపొయ్యాడు లైటు వేసి ఎదురింటి యామినికి జంట బాసిన తన ఏకాకి తనాన్ని, తన్మూలంగా మొహంలో ఏర్పడ్డ నిస్పృహాయతను చూపుకోవడం ఇష్టంలేదు కాని చీకటిలో ఎంత సేపని వుంటాడు' సుందరే వుంటే కటికి చీకటిలోనైనా రాత్రంతా గడుపుతాడు వీధి తలుపు మూసేసి స్విచ్ వేశాడు గది అంతా బోసిగావుంది సుందరి చదివేసిన పత్రిక ఆ యింట్లో ఏంజరిగిందో తెలీనట్లుగా వేసిన చోట పడివుంది మంచం మీద ఆ ఉదయమే

---

డి. రామలింగం

కొత్త గలీబులు తొడుగుకున్న రెండు దిండ్లు ఒక దానిపై ఒకటి వున్నాయి రామం వాటిని చూచి తమ జంట జీవితాన్ని తలపుకు తెచ్చుకున్నాడు ఓమూల సుందరి విడిచిపోయిన పాత చీరెలూ అవీ వున్నాయి వాటిని చూచి సుందరి ఇంకా ఆ గదిలోనే వున్నట్టు భ్రాంతి చెందాడు వుండబట్టలేక ఆ మూల కెళ్ళి రెండు చేతులతో ఆ వాయిల్ చీరెల్ని పైకి తీసి విచిత్రానుభూతితో చూచాడు కాని అక్కడేవున్న కిటికీలోనుంచి తాను ఎలక్ట్రిక్ దీపకాంతిలో యామినికి కన్పిస్తున్నాననీ, ఆమె తన్ను చూచి నవ్వుకుంటూందన్న సంగతి యాదాలాపంగా కిటీకీ లోంచి వీధికేసి చూచేంత వరకూ అతనికి తట్టనేలేదు ఆమె మొహమంతా వెళాకోళపు చిరునవ్వుతో తన్ను ఓరగా చూచి కించిత్తు బాధించి, నిష్క్రమించడం అతనికి తల తీసినంత పనై ఉక్రోషంగా స్విచ్ అఫ్‌చేసి వెనక వరండాలోకి వెళ్ళాడు

అక్కడ ఒక మూల మరునాడు పని మనిషికి వెయవలసిన గిన్నెలూ, చెంబులు రాచ్చిప్పలూ పడివున్నాయి సుందరి చేతుల్లో అవి ఎలా డింకీలు కొడుతూ రకరకాల వంటకాలకు పాత్రలవుతాయో నిర్లిప్తంగా ఆలోచించాడు ఆవిడ తిరిగి వచ్చేసరికి అన్ని శాల్తీలను సక్రమంగా అప్పగించవలసిన తన బాధ్యతను తలచుకొని నవ్వుకున్నాడు సుందరి వున్నంత వరకూ వాటి వూసే తనకు తెలియదు ఇప్పుడవి తనకు ఆత్మీయములైపొయ్యాయి'


అక్కడినుంచి వంటగదిలోకి వెళ్లాడు రాత్రికి వడ్డించుకు భోంచెయ్యండని చెప్పి సుందరి పెట్టిపోయిన గిన్నెలన్నీ అక్కడే వున్నాయి పీట కూడా వేసి వెళ్ళింది తన కిష్టమైన కాల్చిన వంకాయ పచ్చడి బంగాళాదుంప వేపుడు, బెండకాయ పులుసు చేసింది ఆ సాయంకాలం సుందరి వడ్డిస్తే వాటిని ఎంతో ఇష్టంగా మారుకూడా వేయించుకు తినేవాడు అసలు సుందరితో కూర్చొని భోజనం చేయడం అదొక సంతోషకరమైన కాలక్షేపం ఆ మనిషి తీరే అంత—ప్రతి పనినీ ఒక వేడుకగా మార్చుతుంది నిండుగా జీవించడమంటే ఆడవాళ్ళకె తెలుసునేమో' మగవాళ్ళ దంతా తొందర ఆత్రం, కంగారు—అనుకున్నాడతను చివరకి కాళ్ళూ చేతులూ కడుగుకొని ఏవో ఇన్ని మెతుకులు కొరికి గిన్నెలన్నిటినీ దొడ్లో పడేసి ముందు గదిలోకి వెళ్ళాడు

భోజనమైన తరువాత సుందరి ఎంతో సంప్రదాయ బద్ధంగా ఆకులుచుట్టి వక్కపొడితో ఇచ్చెది ఇవాళ తనకు వట్టి వక్కపొడే ప్రాప్తి' గదిలో మంచంపై పక్క పరిచే వుంది పక్కపై కూర్చుంటూ వెనక వెపు కిటికీలోనుంచి పెరట్లోని నైట్‌క్వీన్ చెట్టును చూస్తూ

దాని పూల సువాసనను ఆఘ్రాణిస్తూ తమ దాంపత్యం ఆరంభంనుంచి క్రితం రాత్రిదాకా సంభవించిన సంఘటనలనూ, సన్నివేశాలనూ జ్ఞప్తికి తెచ్చుకున్నాడు ఆకాశంలో నక్షత్రాలకిమల్లే, తమ జీవితం లోనూ ఎన్నో జాజ్వల్యమానమైన అను భవాలు ఆకాశంలో కొన్ని చోట్ల చుక్కలే లేవు• తమ జీవితంలోనూ ఎలాంటి సంఘటనలూ లేని రోజులు కూడా వున్నాయి ఆస్మృతులతో చివ రకు నిద్రాదేవికి వశుడయ్యాడు

* * *

మర్నాటినుంచీ రామం దేశంలోగల నాతిగల బ్రహ్మచారుల్లో ఒక డైపో య్యాడు 'ఏమండోయ్,మిమ్మల్నే' అన్న మేలుకొల్పులు లేవు సెగలపొగల కాఫీ లేదు 'ఈ కూర తరగండి'అన్న పురమా యింపులు లేవు 'బజారు కెళ్ళిరండి' అన్న తాకీదులు లేవు 'వేళయింది, స్నానానికి లేవండి' అన్న హెచ్చరికలు లేవు 'వేళయింది, భోజనానికి రండి' అనే పిలుపులు లేవు అసలు యే పిలు పులూ లేవు అయ్యర్ హోటలులో సాంబారు మెతుకులు, పగలంతా ఆఫీసు సొద సాయంకాలం పెద్దబజారు ప్రదక్షి ణం మళ్ళీ రాత్రికి అయ్యర్ హోటలు రసం మెతుకులు చివరకు ఇంటికి చేరుకొని నిట్టూర్పు విడుస్తూ తాళంతీసి పడక కుర్చీలో చేరగిలపడడం_యామిని అనుమానాస్పదమైన చూపులు, వేళా



"డాక్టరుగారూ నేనీ రోగంలోంచి బయట పడగలనంటారా ? కొందరన్నారు - కొందరు డాక్టర్లు తప్పుగా పరీక్షచేసి నిమోనియా అనుకుని దానికి తగ్గ చికిత్స చేస్తే, ఆఖరికి ఆ రోగి టైఫాయిడ్‌తో చచ్చిపోయోవాట్ట "

"నాన్సెన్స్. నేను టైఫాయిడ్‌కి మందిస్తే, టైఫాయిడ్‌తోనె చస్తాడు "

కోళపు నవ్వులుఏమిటో' ఒంటరి వాడుగా వున్న గృహస్థు వీళ్ళకు చులకనై పోతాడు ' వాటిని భరించడం, మంచంపై నడుంవాల్చి ఇంటి వాసాలకేసి చూస్తూ రోజులు లెక్కపెట్టడం, ఉబుసు పోకకు ఏదో చదవడం, వినోదానికై వెర్రిమొర్రి ఊహలు చేయడం, అసంబద్ధమైన వాటిని ఆలోచించడం, అసంభావ్యమైన వాటిని గూర్చి వేకారడం, చివరకంతా అభాసు అని కొట్టేసి సుందరిని గూర్చి తల పోయడం, అరమరలు లేని కూరిమితో

తాము అనగి పెనగడం, కొదలు తీరని కోర్కెలతో తాము కూడి ఆడడం, కపట మెరుగని మమతలతో తాము కలసిమెలసి వుండడం, ఇత్యాదులన్నీ మనోవీధిలో దృశ్యమానం కావడం,....నిద్ర పట్టక పోవడం మగతనిద్ర కలలు అలలు

* * *

పక్షం రోజులు గడిచాయి రామం ఒక రోజు సాయంకాలం ఏమీ తోచక పక్కపేటలో వుండే సుబ్బారావుగారింటి కెళ్ళాడు ఆ దంపతులిద్దరూ రామం దంపతులకు ఆప్తులు మార్గదర్శకులు బంధువులుకాని ఆత్మీయులు

సుబ్బారావుగారి సతీమణి సుబ్బాయమ్మగారు రామాన్ని చూడ్డంతోటే 'ఏం' ఎక్కడా కనిపించకుండా పోయ్యారు' అని పలకరించారు ఆ మాటవిని లోపల గదిలో డ్రెస్సు చేసుకుంటూ వున్న సుబ్బారావుగారు రామాన్ని చూచి అతనిలో కలిగిన మార్పును గమనించి 'ఏమయ్యా, రాజ్యం పోగొట్టుకున్న యువరాజుకు మల్లె తయారయ్యావేం' అన్నారు అతను నిరుత్తరుడై పొయ్యాడు. సుబ్బారావుగారు అదే సమయమని జగమంతా మాయ అనీ, భార్య కాపరం, సంసారం, పిల్లలు అన్నీ భ్రమలని అతీంద్రియ జ్ఞానం ముఖ్యమనీ వేదాంతం చెబుతూ పొయ్యాడు

'మరి మీరండీ' అన్నాడు రామం నవ్వుతూ.

'ఎవరికైనానయ్యా, మాయామేయ జగంబు అన్నాడు కవి.'

సుబ్బాయమ్మగారందుకుంటూ' ఇదిగో ఇప్పుడా ఇంగ్లీషు సినీమాకు మీ రొక్కరే వెళ్ళగలిగితే' అన్నారు.

సుబ్బారావుగారు ఆమెకు సమాధానం చెప్పకుండా 'ఏమయ్యా, సినీమాకెడదాం వస్తావా' అన్నారు

'మీరు వారికి సమాధానం చెప్పలేదు' అన్నాను

'ఆడవాళ్ళకి సమాధానం చెప్పగలగటమయ్యా వాళ్లతో జీవించడమే మన పని నువ్వింకా చాలా నేర్చుకోవలసివుంది '

'మరి అతీంద్రియత్వం, నిర్మోహత్వం ఎలా?'

'కామి గాక మోక్షకామిగాడు అన్నాడయ్యా వేమన ఏదో అటూ ఇటూగా వుంటూ వుండాలి మరి ఇంతకూ సినీమాకు వస్తావా లేదా?'

'మీరిద్దరూ వెడుతున్నారు కదండీ'

'మేమేం కొత్త దంపతులమా ?'

'మీరూ రండి' అన్నారు సుబ్బాయమ్మగారు కూడా

కాని రామం వారిని ఎలాగో పంపించేసి తాను నేరుగా ఇంటికి చేరుకొని సుందరికొక సుదీర్ఘమైన లేఖ వ్రాశాడు అందులో ఆవిడను వెంటనే వొచ్చేసెయ్యవలసిందనీ, క్షణమొక యుగంగా వుందనీ, ఆ లేఖనే టెలిగ్రాంగా భావించుకోవలసిందనీ వ్రాశాడు :